# అభాండం

21 - D బస్సుకోసం బెసెంట్ నగర్ వాటర్ టాంక్ దగ్గర నిలబడ్డాడు ఆదినారాయణ. బస్ ఏ క్షణంలోనయినా రావచ్చును. ఇప్పుడు అంత రద్దీ సమయం కాదు గనుక కూర్చునేందుకు బాగా జాగా దొరుకుతుంది. నలభై నిమిషాలలో 'ప్యారిస్ కార్నర్' దగ్గర పడేస్తుంది. ఈ రోజన్నా అయనకు మంచి బుద్ధికలిగి యెప్పుడు ఉద్యోగం ఇచ్చేదీ చెబుతాడేమో దామోదరం. ఈ ఊహ రావడంతోటే ఆదినారాయణ తనలో తను నవ్వుకున్నాడు, అవునుమరి! తనపని నవ్వులాటగానే వుంటుంది. ఎప్పుడు వెళ్లినా మళ్లీ యెప్పుడు రావాలో చెబుతాడేతప్ప, నీకు ఫలానచోట ఫలాన ఉద్యోగం వేస్తున్నాను అని ముక్క తేల్చడు. ఇప్పటికి దామోదరంను కలుసుకోడం పదో పదకొండోసారో! తనకు ఉద్యోగం విషయం అంత తప్పనిసరి కాదుగనుక యిలా తరచుగా చూచి రావడం ఆదినారాయణకు కష్టం అనిపించడం లేదు.

బస్ స్టాప్‌కు కుడివయిపుగా వున్న 'కల్యాణ మందిరం' నుంచి పెళ్లిబాజాలు వినవస్తున్నాయి. భోజనాలుచేసి యివతల పడినవాళ్లు బస్ స్టాప్ దగ్గరకు చేరు కుంటున్నారు.

బస్ వచ్చి రావడంతోటే ఓ నల్లటి లావుపాటి ఆయన ఆదినారాయణ కంటే ముందుగానే లోపలకు దూకేశాడు. బస్ సగంఖాళీగానే వుంది. ఆ నల్లటి ఆసామీ ఒక సీట్ చూచుకుని భద్రంగా కూర్చున్నాడు. ఆదినారాయణ అతని పక్కసీట్లో కూర్చుందామనుకున్నాడుగానీ, బస్సంతా ఖాళీగా వుండగా యిరు క్కోవడం ఏమంత ఖర్మం? అనిపించి, వెనక సీటులో తన శరీరం జారవేశాడు. వెనకాల యింకా యిద్దరు ముగ్గురు ఎక్కి సుఖాసీనులు అయ్యారు. కండక్టర్ 'ఈల' వేశాడు. బస్ కాస్త ముందుకు పరుగుతీసింది కూడా. అయినా యెవరో వెనుకనుంచీ అరచుకుంటూ రావడంతో డ్రయివర్ నింపాదిగా పోతున్న బండిని స్తంభింపచేశాడు. ఓ ముప్ఫయేళ్ల పడుచు ఆయాసపడుతూ బస్‌లోనికి వచ్చిపడింది.

'రక్షించావు, నాయనా లేకపోతే నేను అరగంటసేపు యిక్కడ పడిగాపులు

పడి వుండవలసి వచ్చేది' అంది కండక్టర్‌ను చూచి. అతను ఏమీ మాట్లాడకుండా 'చీటీలు' యివ్వడంలో మునిగి పోయాడు. ఆమె ముందుకు నడచి ఆదినారాయణ సీటుకు ముందు కూర్చున్న నల్లటి ఆసామీతో, యిక్కడే వున్నావు గదా! నీతో మాట్లాడాలనే పరుగు పరుగున వచ్చాను, మా పిన్నమ్మ సాయం కాలందాకా వుండిపొమ్మని బలవంతం చేస్తూ వున్నాగానీ! ఏం. అప్పుడే బయలు దేరావు? నాతో మాటమాత్రమయిన చెప్పకూడదా! నీ ఆత్రం తగలబడిపోనూ, అంది.

ఆ ఆసామీ యీామె మాట్లాడుతున్నంతసేపూ గుడ్లు వప్పచెప్పి కూర్చున్నాడు. ముఖం మీద కాస్త సంబరం కూడా పులుముకున్నాడనిపించింది ఆదినారాయణకు, వెనుకనుండి చూడగా. 'ముందు కూర్చో. తరువాత పోట్లాడుదువుగాని, అన్నాడు అతను.

ఆమె అతనిసరసన కూర్చుంటుందేమో అనిపించింది అతనికి. అసలు అలా కూర్చోవాలనుకునే తీరా ఒక్కక్షణం తటపటాయించి యెందుకయినా మంచిది అనుకున్నట్లుగా -- ఆ సీట్ వరుసలోనే వున్న ఆడవాళ్ల జాగాలో కూర్చుండిపోయింది ఆమె. 'మధ్యలో స్టాండింగ్ ప్యాసెంజర్లు' లేరు గనుక యిద్దరికీ మాట్లాడుకుందుకు వీలేనని సమాధానపడింది అనుకున్నాడు ఆదినారాయణ.

'యేం రత్నం, యేమిటి కబుర్లు?' అన్నాడు ఆ ఆసామీ.

'నువ్వు చెబుతావనేగదూ యిలా పరుగెత్తుకు వచ్చిందీ!' అంది ఆమె.

'చాలాబిజీ అయిపోయినావు. ఎక్కడా దర్శనాలే లేవు.'

'ఇదుగో యిటువంటి మాటలు యిచ్చకాల కబుర్లు చెబితేనే నాకు చిరాకెత్తుకు వస్తుంది. అయినా నీ కళ్లకు యిప్పుడు మేం యెక్కడ కనిపిస్తాంలే బలరామయ్యా. బాగా పెద్దవాడివి అయిపోయినావుగదా!' అంది రత్నం అనే ఆవిడ.

ఎంత పూర్వ పరిచయం వున్నవాళ్లు అయినా, యిలా బస్‌లో కూర్చుని అందరూ వినేట్లుగా బిగ్గరగా మాట్లాడుకోవడం చూస్తూవున్న ఆదినారాయణకు విడ్డూరమే అనిపించింది. బలరామయ్య లాల్చీ జేబులోనుంచి తమలపాకుల డబ్బా తీశాడు. ఆకులు -- సున్నం -- వక్క కాస్తంత పొగాకు భస్మం మిళాయించి నోట్లో వేసుకున్నాడు.

'రత్నం. ఆకులున్నాయా? యిమ్మంటావా' అన్నాడు.

'పెళ్లివారి తాంబూలం యింకా నోట్లోనే ఆడుతూ వుంది. ఇప్పుడే వద్దులే..' అంది ఆమె. ఈ మాటలు అనీ అనడంతోటే నాలుక ఎంత బాగా పడిందో

చూచుకోవడానికి అన్నట్లుగా ముందుకు జాపింది. ఆ 'ఎరుపు' చూచి ఆదినారాయణ అదిరిపోయినాడు. ప్రేమ, ఆపేక్ష వున్నవాళ్లకు తమలపాకులు వేసుకుంటే నోరు బాగా పండుతుందనే 'నానుడి' గుర్తు వచ్చింది అతనికి. రత్నాన్ని మరింత పరిశీలనగా చూచాడు. నీలం రంగు పట్టుచీర, దానికి తగిన జాకెట్ వేసుకుంది. మెడలో రెండు మూడు నగలున్నాయి. ముఖాన రూపాయి కాసంత బొట్టు. వెడల్పాటి ముఖం – ఎవరికయినా ఒకటికి రెండుమార్లు చూడాలనిపించే ముఖం. మరిచి పోదామంటే అంత తేలికకాదు. పచ్చని పసిమి కాకపోయినా శరీరంలో యితర అందాలు ఎలా ఆకట్టుకుంటాయో రత్నాన్ని ఉదాహరణగా చెప్పకోవచ్చును అనుకున్నాడు ఆదినారాయణ.

'ఆంధ్రా హాస్పిటల్' అని కేకవేశాడు కండక్టర్.

ఆదినారాయణ ఉలిక్కిపడ్డాడు.

నలుగురయిదుగురు బస్ లోపలకు వచ్చారు.

జాగాలన్నీ భర్తీ అయిపోవడమేకాక యిద్దరు మనుషులు 'స్టాండింగ్' జాబితా లోనికి వచ్చేశారు. వీళ్లు యెక్కువయిపోతే తనకు బలరామయ్య, రత్నం మాటలు వినబడడం, రూపు కనబడడం కష్టమయిపోతుంది. అదీ ఆదినారాయణ బాధ!

'ఈ శుభలేఖ చూచిననాడే అనుకున్నాను ఈ పెళ్లికి నువ్వు యెలాగూ వస్తావని' అన్నది రత్నం.

'అవును. ఊరికి వెళ్లాల్సిన పనివుంది. అయినా వాయిదా వేసుకున్నాను. పెళ్ళికి రాక పోతే యేం బాగుంటుంది?'

'అవున్లే, స్వయానా బావమరిది అత్తగారి కూతురేగా నీకు. నీ భార్య అక్కడే వుండి పోయిందా?'

'ఊఁ... ఆడవాళ్ల వేడుకలన్నీ చూచుకుంటూ రాత్రంతా అక్కడే వుంటుంది. నేను దుకాణం పనిమీద వెళ్లాలని బయటపడ్డాను'

'దుకాణానికి పోతావా యిప్పుడు?'

'పోక చేసేదేముంది?' అన్నాడు బలరామయ్య ఒక్కక్షణం. ఆగి, 'అది సరేలే రత్నం యెక్కడుంటున్నావు; యేమిటి కథ? చెప్పరాదూ?' అన్నాడు.

'నా సంగతి చెప్పేదేముందిలే బలరామయ్యా? ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే వుంటుందన్నట్లుంది నా సంసారం. పెళ్లిలో నీ భార్యని పలుకరిస్తిని. కాంతమ్మ మనసు విప్పి మాట్లాడనేలేదు. ఇంకా కోపంగానే వున్నట్లుంది నామీద.'

'దాని ముఖం. దానికేం కోపం?'

బస్ అయ్యప్పగుడి స్టాప్ దగ్గర ఆగింది.

రత్నం గుడివేపు చూచి దణ్ణంపెట్టి బుద్ధిగా చెంపలు వాయించుకుంది. ఆది నారాయణకు నవ్వు ఆగలేదు. నవ్వినా, వాళ్లు తనను గమనించరు గనుక మనసు తీరా సంతోషించాడు.

'పోనీలే. నీవయినా బాగా వుంటే అంతే చాలు. నా ముఖాన యెలాగయినా యింతే వ్రాసి వున్నదని నిద్దరోతా' అంది రత్నం.

'యిప్పుడు నీకేం కష్టం వచ్చిందని?'

'నా కష్టం ఒకళ్లు తీరిస్తే పోయేది కాదులే. అయినా నీకు జాలిలేకపోయినా తర్వాత నేను యెంత మొత్తుకుంటే ముటుకు యేం లాభం?'

బలరామయ్య ముఖం చిట్లించాడు.

అతని వైఖరి చూస్తే సంభాషణ యిలా సాగడం అతనికి యెంతమాత్రం యిష్టంలేదని అనిపించింది ఆదినారాయణకు.

'తీగ కదిలిస్తే డొంకంతా కదులుతుంది. బలరామయ్యా, నాసంగతి నన్నేమీ అడగకు' అంది రత్నం.

బలరామయ్య యేమీ మాట్లాడలేదు.

'నీ వ్యాపారం యిప్పుడు యెలా వుంది?' అనడిగింది రత్నం తనే ఒక్క క్షణం ఆగి.

'ఊ పరవాలేదు.'

'ఎలాగయినా నిలదొక్కుకున్నావులే. నీ పరిస్థితి యేమయినా తలకిందిలయిం దంటే అందరూ నన్నే దుమ్మెత్తి పోస్తారని నాలో నేను యెంత కుమిలిపోయానో నీకు తెలియదు.'

బలరామయ్య నవ్వాడు. ఆ నవ్వులో యెన్నో అర్థాలు కనిపించాయి ఆది నారాయణకు.

కండక్టర్ 'ఆకాశవాణి – లైట్ హైస్?' – అని కేకలేశాడు. ఆదినారా యణ లైట్ హౌస్ వయిపు తలెత్తి చూచాడు. సముద్రం సువిశాల పరుచుకుని కనిపిస్తోంది వెనుకగా.

'నేను మెరీనా దగ్గర దిగిపోనా? మా మేనగోడలు యింటికి వెళతాను, ఇప్పటినుంచి యింటికెళ్లి ఏం చేయాలి?' అంది రత్నం.

'నేను దుకాణానికి పోవాలి. 'పారిస్' దగ్గిర దిగుతా —' అన్నాడు బలరామయ్య.

'అయితే నేను కూడా అంత దాకా వచ్చేదా? లేకపోతే మెరీనాలో దిగిపోయి—'

'నీ యిష్టం. అయినా యెందుకులే సముద్రంలో దిగడం — తిన్నగా యింటికి వెళ్లు —' అన్నాడు బలరామయ్య.

'నా బతుకు అట్లాగే తయారయింది. నీక్కూడా లోకువ అయిపోయినానుగా—'

'ఛ—ఛ— ఊరికే సరదాకు అన్నాను. కావాలంటే మెరీనాలోనే దిగి మీ మేనగోడలు పిల్లను చూచి రాత్రి పదింటికి యింటికి చేరుకో దారిలో, యేదయినా సినిమా కూడా చూచుకుని. నాకేం మధ్యని—'

'టికెట్ పారిస్ దాకా తీసుకున్నాన్లే—'

'అయితే యింకా ఆలోచన యెందుకు? చివరిదాకా పద—' అన్నాడు బలరామయ్య.

ఈ జంట సంభాషణ తనకు చివరిదాకా ఆసక్తి దాయకంగా వుంటుందని ఆదినారాయణ కూడా మురిసిపోయాడు.

బస్ ప్రెసిడెన్సీ కాలేజి దాటి ముందుకు పరుగెత్తుతూంది.

అయినా నీ అభిమానం కోసం నేను ప్రాకులాడడమే గానీ, నీకు వీసమెత్తు అయినా విశ్వాసం లేదుగదా! అంది రత్నం.

'ఇప్పుడేం చేశాను. నేను—'

'అదే — పెళ్లి పందిరిలో ఆ సుబ్బారావును నువ్వు అట్లా వదలవలసింది కాదు'

'వదిలేయక యేం చేయమంటావు రత్నం?

'నేనయితే నిలబెట్టి మరీ వసూలు చేసే దాన్ని, బాకీ, అణాపైసలతో సహా—'

'పోనీలే పాపం. వాడి అవస్థ మనకేం తెలుసు?'

'నువట్లా అందరినీ పాపం తలుస్తావు గనుకనే నీకు వ్యాపారంలో యిలా నష్టం వస్తోంది. ఇంకొకడు, యింకొకడు అయితే ఫ్యాన్సీ షాప్ మీద మేడలే కట్టేసేవాడు.'

'నాకు మేడలు కట్టాలని లేదులే రత్నం—'

'మేడలు కట్టకపోయినా, వున్న మిద్దెలయినా మిగలాలిగా'

'పోనీలే, సుబ్బారావు సంగతి వదిలెయ్యి'

'అదే – ఎందుకు వదిలెయ్యాలీ అని–'

'వాడి దగ్గర డబ్బు వుంటే యిచ్చేవాడే గదా! బాకీ తీర్చాలని వాడికి మాత్రం తెలియదా యేమిటి?'

రత్నం సమాధాన పడదలుచుకోలేదు.

బలరామయ్యే తనకు బాకీ వున్నట్లుగా "అయినా యివాళా – నిన్ననా? అయిదారేళ్లు అయిపోలా ఆరువేల మీద వడ్డీ ఎంత లేదన్నా మరో ఆరువేలన్నా కలిసి వుంటుంది. పన్నెండు వేలు బాకీ వసూలు చేసుకోకుండా నీవు నిమ్మకు నీరెత్తినట్లుగా వున్నావంటే యింకేం అనుకోవాలి? అసలు నీకు వసూలు చేద్దామని వుందా' లేదా – ఒక్కమాట చెప్పు వింటాను" అని డబాయించింది.

'అబ్బ – పోనీలే ఆ సొద – అన్నానుగా –' అన్నాడు బలరామయ్య విసుగ్గా.

'అయింది. నేను అనుకున్నంతా అయింది. నీకు ఈ బాకి వసూలుకాదు.'

'పోతే పోయిందిలే'

'ఎందుకు పోవాలి – అంటాను. అప్పుడంటే సుబ్బారావుకు జరగని రోజులు గనుక నువ్వు సహాయం చేశావు. నీ డబ్బుతోనేకదా కాంట్రాక్టు పనులు మొదలుపెట్టింది! ఒకప్పుడు మింగమెతుకు లేనివాడే. నిజమే - ఇప్పుడు వాడిస్థితి పైలా పచ్చీసుగానే వుంది. పల్లెటూళ్లో ప్రతీ ఏడూ రెండు ఎకరాలు కొంటూనేవున్నాడు. అసలు ఏ మాత్రం జ్ఞానం వున్న వాడైనా–'

'అబ్బ పోనీ రత్నం ఇప్పుడా గొడవంతా ఎందుకు?'

'అదే నేనూ అడిగేది; ఎందుకు అంటూనే యిన్నాళ్లునెట్టుకు వచ్చావుగా! ఆ విశ్వాసమన్నా వుందీ వాడికి?'

'పోనిద్దూ–'

'అయినా, ఒక్కమాట చెప్పు – నీవు అడిగినప్పుడు యేమన్నాడు?'

'ఏదీ నేను అడగలేదుగా' అన్నాడు బలరామయ్య, యేదో తప్పుచేసినవాడిలా గొంతు పెట్టి.

'నువ్వు అడగవు. అందుకే నేను అడుగుతానంటాను. నన్ను అడగనివ్వవు. ఎట్లా నీతో?'

'రత్నం, నాకులేని బాధ నీకెందుకు చెప్పు? నాకు రావలసిన బాకీ నేను

అడగనప్పుడు, నువ్వు అడిగితే, వాళ్ళేమనుకుంటారు?'

'వాళ్ల యేమనుకుంటే నాకేమయ్యా; నాకు తేలవలసింది అసలు విషయం--'

'యేమిటది?'

బస్ 'వార్ మెమోరియల్' దాటి వెళుతోంది.

ఆదినారాయణ వళ్లంతా చెవులు చేసుకుని వింటున్నాడు. సముద్రం హోరులో, బస్ చప్పళ్లలో మాటలు యెక్కడ తడబడతాయో -- అని.

'నువ్వు అడిగితే మటుకు యిస్తారా, వాళ్లకు చేతకానప్పుడు? అయినా నేను అడగలేక నీ చేత అడిగించానని అప్రతిష్ఠ రాదూ? ఇందులో నువ్వెందుకు కలుగజేసుకోవడం? నా మాట విని యీ సంగతి యింతటితో మర్చిపో' అన్నాడు బలరామయ్య.

'ఆ! అదేనయ్యా-- నాకు కావలసింది! నీకు అడగాలని ఎందుకు లేకపోవాలి? ఆ డబ్బు, నువ్వు సుబ్బారావు భార్యకు కానుకగా ఇచ్చావా? లేదా? అన్న సంగతే నాకు తేలాలి. అంతేగాని, నీకు ఆ బాకీ వసూలు అయితే నాకేం, కాకపోతే నాకేం--' అంది రత్నం తీవ్రంగా.

బలరామయ్య బిక్కముఖం వేయడం ఆదినారాయణ గమనించలేదు. ఎందుకంటే బలరామయ్య ముఖం పక్కకు తిప్పుకుని పై మీది తువాలుతో నుదురు, చెంపలు తుడుచుకుంటున్నట్లు నటిస్తున్నాడు!

❀